# మౌలిక ఆలోచనాపరుడు

**డాక్టర్** కె. బాలగోపాల్ ఆకస్మిక మరణం ఊహించని విషాదం. ఆయన మరణ వార్తను చాలా మంది నమ్మలేకపోతున్నారు. దిగ్భ్రాంతిలో ఉన్నారు. సన్నిహితులే కాదు, అపరిచితులు కూడా ఆ మానవీయని శాశ్వత నిష్క్రమణ పట్ల బరువెక్కిన హృదయాలతో ప్రతిస్పందించారు. బాలగోపాల్ మేధో జీవితం, నిష్కల్మష వ్యక్తిత్వం గురించి మీడియా విస్తృతంగా రాసింది. చర్చించింది. దుఃఖంలో మునిగిపోయిన ఆయన కుటుంబమూ, భారతదేశంలోనే కాక, ఇతర చోట్ల కూడా మానవహక్కుల ఉద్యమంలోని ప్రతి ఒక్కరూ తేరుకోవడానికి కొంత వ్యవధి పడుతుంది. పౌరహక్కుల పోరాటాలకు, బాలగోపాల్ మృతితో తీరని నష్టం వాటిల్లింది. వాటిని ఒక శూన్యం ఆవరించింది. మానవ హక్కుల ఉద్యమం పైనే కాక విస్తృత స్థాయిలో పలు సామాజిక ఉద్యమాలపై బాలగోపాల్ స్ఫూర్తిదాయక ప్రభావానికి ఆయన మరణంతో వెల్లువైన సంఘీభావం, ఆత్మీయ జ్ఞాపకాలే నిదర్శనం.

బాలగోపాల్ చాలా ముభావి. మాటలకు కాక చేతలకే ఆయన ఎప్పుడూ ప్రాధాన్యమిచ్చేవారు. తనను గురించి ఆయన ఎప్పుడూ మాట్లాడేవారు కాదు; ఎవరు ఎంత బతిమాలినా, రెచ్చగొట్టినా కూడా ఆయన తన సొంత విషయాలను ప్రస్తావించేవారు కాదు. ఏకాంతంగా ఆలోచించడంలోను, రాసుకోవడంలోనే అధిక సమయాన్ని గడిపేవారు. ప్రశాంతంగా అయితే దృఢంగా పౌర హక్కుల ఉద్యమాన్ని నిర్మించడంలో నిమగ్నమై ఉండేవారు. తొలుత ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ఆ తరువాత మానవ హక్కుల వేదిక ద్వారా హక్కుల గురించి సమాజాన్ని, మరీ

ముఖ్యంగా అణగారిన ప్రజలను జాగృతం చేశారు. అసాధారణ మేధో నైశిత్యం గల బాలగోపాల్ ఎంత వినయంగా ఉండేవారో ఆయన హఠాన్మరణంతో పెల్లుబైన పలువురి జ్ఞాపకాలు వెల్లడించాయి. అయితే బాలగోపాల్ ఇంకెంత మాత్రమూ మనకు తెలిసిన ఒక వ్యక్తి పేరు కదనీ, మనకాలపు మహా పోరాటాలకు ఒక సంకేతమనే గుర్తింపు మన మనస్సులోకి ఇంకడం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. ఆ సంకేతపు గొప్పదనాన్ని సంపూర్ణంగా తెలుసుకోవడానికి బహుశా దీర్ఘకాలమే పట్టవచ్చు.

భౌతిక జగత్తు, మానవ వ్యవహారాలకు సంబంధించిన జ్ఞానం పుట్టుక, పెరుగుదలలో వివిధ దశలను 'అవగాహనా చట్రంలో మార్పు' (ప్యారడైమ్ షిఫ్ట్) అనే భావనతో అర్థం చేసుకోవచ్చని సూచించడం కద్దు. ఈ మేధో సత్యాన్ని బట్టి మనదేశంలోని సామాజిక ఉద్యమాలు లేదా పోరాటాల్లో ప్రత్యేకించి మానవ హక్కుల ఉద్యమంలో బాలగోపాల్ ఒక మౌలిక మార్పును సాధించారని నిస్సందేహంగా చెప్పగలము. అయితే ఆ మౌలిక మార్పు అందరికీ అంగీకార యోగ్యమైనదేనా అనే అంశానికి కాక బాలగోపాల్ వ్యక్తిగత అభిప్రాయాలు ఎందుకు, ఎలా ఆ మౌలిక మార్పుకు దోహదం చేశాయన్న విషయమై విభిన్న వివరణలే ముఖ్యమైనవని చెప్పవచ్చు.

బాలగోపాల్ ప్రప్రథమంగా ఒక ఉత్తేజకర ఉపాధ్యాయుడు, బోధన భావనను సమూలంగా మార్చివేసి విస్తృత స్థాయిలో యువ విద్యార్థులు, కార్యకర్తలకు స్ఫూర్తి నిచ్చిన అధ్యాపకుడు. తీవ్రవాద ఉద్యమాలు ఎప్పుడూ సామాజిక పోరాటాల ప్రక్రియలను మౌలిక శిక్షణకు తావులుగా భావిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీవ్రవాద సామాజిక పోరాటాల సంప్రదాయం నిస్సందేహంగా ఆ రీతిలోనే కొనసాగుతోంది. అయితే బోధనను గురించిన బాలగోపాల్ దృక్పథం దానితో మౌలికంగా రెండు విధాలుగా విభేదిస్తుంది. ఒకటి-సామాజిక వాస్తవాన్ని అర్థం చేసుకోవడంలో తీవ్ర విభేదాలు ఇతరుల అవగాహన 'తప్పుడు అవగాహన' గా భావించడానికి దారి తీయాల్సిన అవసరం లేదు. రెండోది-విప్లవ ఆలోచన, కార్యాచరణ-సంబంధిత బోధనా ప్రదేశాలను సుస్థిరం చేయడానికి ప్రాథమిక అవసరాలు-బోధకునిలో వినయాన్ని కేవలం విశదీకరణ ద్వారా కాకుండా, సొంత వర్తనతో ఉత్తేజ పరచడం ద్వారా బోధించడాన్ని డిమాండ్ చేస్తుంది. 1981లో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం మేనిఫెస్టో పౌరహక్కులు అంటే ఏమిటి? అనే పుస్తకాన్ని రచించిన నాటి నుంచి

తుది శ్వాస విడిచే బాలగోపాల్ ఆలోచనలోను, ఆచరణలోను ఎంతో వినయంతో వ్యవహరించేవారు. పౌర హక్కుల ఉద్యమం కోసం ఆయన అసంఖ్యాక రచనలు చేశారు. అయినా ఏనాడూ ఆయన తన రచనా కర్తృత్వం గురించి పట్టించుకోలేదు. ఆవిర్భవిస్తోన్న కొత్త సామాజిక వాస్తవాల నేపథ్యంలో కొత్త వివరణలు, అవగాహనను అన్వేషించడంలో నిరంతరమూ నిశితంగా, వినయంగా ఆ వాస్తవాలను పరిశీలించవల్సిన అవసరాన్ని కూడా ఆయన ఎప్పుడూ విస్మరించలేదు. ఆ విధంగా సామాజిక విశ్లేషణలో పలు కొత్త వర్గాలకు చోటు కల్పించాలని బాలగోపాల్ డిమాండ్ చేశారు. ఎవరి 'దృక్పథం' సరియైనదని కాక తన ప్రయత్నాల ద్వారా ఆ కీలక వర్గాల గురించి మరింతగా ఆలోచించేలా చేయడంలో ఆయన చాలా వరకు సఫలుడయ్యాడన్నదే ఇక్కడ చాలా ముఖ్యమైన విషయం. తీవ్రవాద ఉద్యమాలను మరింతగా ప్రజాస్వామ్యీకరించడంలో ఇదొక ముందడుగు అనడంలో సందేహం లేదు.

భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో స్వతంత్ర మానవ హక్కుల ఉద్యమాన్ని నిర్మించిన వ్యక్తిగా బాలగోపాల్ గుర్తుండిపోతారు. మనదేశంలో పౌర హక్కుల ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచీ అంటే 1936లో 'భారతీయ పౌరహక్కుల సంఘం' ఆవిర్భవించిన తదాది రాజకీయ ఉద్యమాలు/పార్టీలకు అనుబంధంగా కాక స్వతంత్రంగా పనిచేయాలనే విషయం ఒక సమస్యగా కొనసాగుతూ వస్తోంది.

స్వతంత్ర మానవహక్కుల ఉద్యమాన్ని నిర్మించడంలో బాలగోపాల్ చేసిన కృషి రెండు విధాలుగా విశిష్టమైనది. రాజకీయ పక్షాలు తమ సంత ప్రయోజనాలకై మానవ హక్కుల ఉద్యమానికి మద్దతునివ్వడం, అందుకు విరుద్ధంగా పౌరహక్కుల ఉద్యమ నిర్ణాయక విలువలు, సూత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం అనే అంశాలకు సంబంధించిన చారిత్రక ఆందోళనలపై చర్చను ముందుకు తీసుకువెళ్ళడమే కాక దానిని మరింత విస్తృతం చేశారు. 1980ల తొలినాళ్లలో ఎపిసిఎల్‌సి ని పటిష్టం చేయడంలో ఉద్యమ నిర్దేశక విలువలపై అనేక వివరణలు ఇచ్చారు. రాజకీయ ఉద్యమాలు/పార్టీల వ్యూహాత్మక వైఖరుల నుంచి కాక హక్కుల ఉద్యమ నిర్దేశక విలువల నుంచి సామాజిక సంఘటనలను విశ్లేషించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కులం, జెండర్‌కు సంబంధించిన అంశాలను కూడా బాలగోపాల్ తొలుత పౌరహక్కుల ఉద్యమ పరిధిలోకి

తెచ్చారు. గత శతాబ్ది తొమ్మిదో దశకం నడిమి సంవత్సరాల నుంచి ఆయన ఈ అంశాలపై విస్తృతంగా రాశారు. ఉద్యమాలు ప్రజాస్వామ్యయుతంగా ఉండడానికి అవి తమ సొంత కార్యక్రమాలు, వైఖరులపై విమర్శనాత్మక దృష్టిని కలిగి వుండాల్సిన అవసరమెంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. 'స్వతంత్ర ఉద్యమం' అంటే రాజకీయ పార్టీలు, వాటి ఉద్యమాలు, లక్ష్యాలతో ఎటువంటి ప్రమేయం లేకుండా ఉండడం కాదని, మానవ హక్కుల ఉద్యమ పరిధిలోకి మరిన్ని సామాజిక సమస్యలను తీసుకురావడమూ, వాటిపై నిరంతర విశ్లేషణల ద్వారా మానవహక్కుల దృక్పథాన్ని విస్తృతం చేయడమేనని బాలగోపాల్ భావించారు.

మానవ హక్కుల ఉద్యమానికి వికేంద్రీకృత, అట్టడుగు స్థాయిలో పనిచేసే సంస్థాగత వ్యవస్థలను నిర్మించడం స్వతంత్ర మానవ హక్కుల ఉద్యమ నిర్మాణానికి ఆయన చేసిన మరో విశిష్ట సేవ, గత మూడు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ అంతటా కార్యకలాపాలు కొనసాగిస్తోన్న రెండు కీలక సంస్థలు ఎపిసిఎల్‌సి, మానవహక్కుల వేదికలలో ఆయన అగ్రశ్రేణి నేతగా ఉండడమే ఆయన నాయకత్వ దక్షతకు నిదర్శనం. అంతేకాదు మానవహక్కుల ఉద్యమం సంస్థాగతంగా పటిష్టంగా, సుస్థిరంగా ఉండాలన్న విషయమై ఆయన నిబద్ధతకు కూడా అది తిరుగులేని రుజువు.

మానవ హక్కుల ఉద్యమానికి సంబంధించిన అవగాహన చట్రంలో బాలగోపాల్ తీసుకు వచ్చిన మౌలిక మార్పు (ప్యారడైమ్ షిఫ్ట్) ఏక సమయంలో నిర్ణాయక విలువల పరమైనది. సంస్థాగతమైనది. బోధనా సంబంధమైనది. ఈ సమిష్టి లక్షణాలే మానవ హక్కుల ఉద్యమానికి ఒక మౌలిక ప్రగతిశీల స్వభావాన్ని సంతరింప చేసి, ఆ ఉద్యమ చరిత్రను ఒక కొత్త మలుపు తిప్పాయి.హక్కుల పోరాటాలు ఒక సరికొత్త పథంలో ప్రవేశించేందుకు తోడ్పడ్డాయి. ఈ మూడు దృక్కోణాలతో ప్రమేయం లేకుండా నేడు మానవహక్కుల ఉద్యమాన్ని గురించి ఆలోచించడం సాధ్యం కాదు. అంతర్ముఖీనుడైన బాలగోపాల్ మానవ హక్కుల ఉద్యమం అంతటా ఉంటూ కూడా ఎవరికీ ఉద్యమ వ్యక్తిగా కన్పించని నిరాడంబరుడు. మానవ హక్కుల ఉద్యమానికి బాలగోపాల్ సేవలను పరిగణనలోని తీసుకున్నప్పుడు నిజంగా ఆ ఉద్యమానికి ఆయన ఒక మహానాయకుడుగా కనిపిస్తాడు. ఆయన ఒక మౌన కెరటం. అహంకారంలేని, నమ్రత ఉట్టి పడే ఒక పరిణామం. ఎన్నో కొత్త సమస్యలు చుట్టుముడుతున్న సమయంలో

ఆయన చనిపోవడం మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటు. ఆయన కృషిని మరింత ముందుకు తీసుకెళ్ళడమే కాక, మానవ హక్కుల ఉద్యమంలో మరో మౌలిక మార్పును సాధించేలా ముందుకు తీసుకువెళ్ళడమే బాలగోపాల్‌కు సరైన నివాళి కాగలదు. బాలగోపాల్ కృషిని ముందుకు తీసుకువెళ్లడమంటే ఆయన అభిప్రాయాలతో ఏకీభవించడం, ఆయన చెప్పిన విషయాలను విశ్వసించడం కానేకాదు. ఆయన ఏ విలువలతోనైతే జీవించారో ఆ విలువల–విమర్శనాత్మక బోధన, అసంకల్పిత వినయం, సంస్థా నిర్మాణానికి నిబద్ధత–ను ఔదలదాల్పడమనేనని మనం గుర్తించుకోవాలి.

**–సీతారామం కాకరాల**

*16 అక్టోబర్ 2009, ఆంధ్రజ్యోతి పత్రికలో*